క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మాడుగుల రూరల్ : మేజర్ గ్రామ పంచాయతీ కె.జె.పురం గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షణలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సత్యనారాయణ పర్యవేక్షణలో గురువారం గ్రామంలో మోదమాంబ ఆలయం వద్ద పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఆలయం చుట్టు చెత్త, చెదారాలు శుభ్రం చేశారు. అలాగే గ్రామంలో అన్ని చోట్ల ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడతామని సర్పంచ్ తెలిపారు.

విరివిగా చిక్కుడు సాగు


మర్రివలసలో సాగులో ఉన్న చిక్కుడు పంట

కె.కోటపాడు: మండలంలో చిక్కుడు పంటను రైతులు పందిరి విధానంలో సాగు చేపడుతున్నారు. పందిరి విధానంలో చిక్కుడు పంటను సాగుచేయడం వల్ల అధిక దిగుబడితో పాటు పంటకు తెగుళ్ల త్వరగా ఆశించే పరిస్థితి ఉండదని సాగురైతులు తెలుపుతున్నారు. దాలివలస, మర్రివలస, శృంగవరం, ఆర్లి, కె.కె.అగ్రహారం, కొత్తఅగ్రహారం గ్రామాల్లో 110 ఎకరాల్లో రైతులు పందిరి విధానంలో చిక్కుడు పంటను సాగు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ పంట పూత దశలో ఉందని మరో నెలరోజుల్లో పంట ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు.

5వ వార్డులో సీసీ రోడ్డు ప్రారంభం


మాడుగుల 5 వ వార్డులో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న దృశ్యం

మాడుగుల : మాడుగుల పట్టణం 5వ వార్డులో మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు ప్రారంభించారు. దీంతో సుమారు 30 కుటుంబాలకు రహదారి సౌకర్యం కలిగింది. గతంలో వర్షం కురిస్తే మురుగునీరు ఇళ్లలోకి చేరేదని 5 వ వార్డు వాసులు చెబుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మోదమాంబ కమిటీ సభ్యుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబరు అప్పలరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

గొలుగొండ : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్‌ఐ తారకేశ్వర్రావు ఆధ్వర్యంలో కృష్ణదేవిపేట జెడ్పీ హైస్కూలు, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాల అధికంగా ఉన్న కారణంగా ప్రజలు వాటిపై ఎలా అవగాహన కలిగి ఉండాలనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ముగ్గురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి త్వరలో బహుమతులు అందిస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల సేవలు వినియోగించుకోండి


అవురువాడ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ కరుణాకర్

మాడుగుల రూరల్ : ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ద్వారా ప్రజలు ఆధార్ కార్డులో తప్పు ఒప్పులను సరిదిద్దుకోవాలని, మండల పంచాయతీ విస్తరణాధికారి(ఈవోఆర్డీ) కె.కరుణాకర్ పేర్కొన్నారు. గురువారం అవురువాడ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ నెల 25 వ తేదీ వరకు ఈ ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా సేవలు అందిస్తామన్నారు. గురువారం జి.అగ్రహారం, వీజేపురం, శంకరం, సచివాలయాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పి.సుధ పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతాల్లో పచ్చగా పొలాలు

- వరి పంటకు అనుకూలించిన వర్షాలు
- పుష్కలంగా సాగునీరు
- పొట్ట దశలో కురిసిన వర్షంతో రైతులకు మేలు


లూలూరులో వరి కంకులు వచ్చిన వరి చేను


నిండుగా నీటితో ప్రవహిస్తున్న పెద్దేరు కాలువ


నీటితో నిండిన దిబ్బిడి చెరువు


పచ్చగా కనిపిస్తున్న కస్పా పొలాలు

బుచ్చెయ్యపేట : ఖరీఫ్ వరి పంటకు వర్షాలు అనుకూలించాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు వల్ల పలు గ్రామాల్లో వరి పొలాలకు పుష్కలంగా సాగు నీరు అందింది. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో సరైన సాగునీటి కాలువలు లేకపోవడంతో వర్షాధారంగానే రైతులు పంటలు పండిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వరి పంట సాగుకు వర్షాలు సక్రమంగా అనుకూలించకపోవడంతో రైతులు కంగారు పడ్డారు. జులై ,ఆగస్టు నెలల్లో కురిసిన కొద్దిపాటి వర్షాలకు సాగు నీరు సక్రమంగా అందక వరి సాగుకు డీజిల్ ఇంజిన్లు, మోటార్లు మీద రైతులు ఆధారపడ్డారు. దూరప్రాంతాల్లో ఉన్న పంట పొలాలకు పైపుల ద్వారా నీటిని తోడి తరలించారు. సాగునీటికి అష్టకష్టాలు పడి ఆరంభంలో వరి నాట్లు వేశారు. నాట్లు వేసిన తరవాత వర్షాలు అడపాదడపా కురిశాయి. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న 35 పంచాయతీల్లో ఈ ఏడాది 6,300 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వరి నాట్లు వేసినట్లు వ్యవసాయశాఖ సిబ్బంది అంచనాలు వేశారు. వరినాట్లు వేసి మూడు నెలలు అవడంతో అన్ని గ్రామాల్లో వరి పొలాలు పొట్ట దశకు చేరి వరి కంకులు వేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు వల్ల ముఖ్యంగా మెట్ట ప్రాంతాలైన రాజాం, మల్లాం, ఆర్ భీమవరం, శివరాంపురం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, గున్నెంపూడి, కరక, సీతయ్యపేట, పెదపూడి, కొండపాలెం, పెదమదీన తదితర గ్రామాల్లో పంట పొలాలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. చెరువులు, వ్యవసాయ బావుల్లో నీరు చేరింది. గెడ్డలు, వాగులు నీటితో ప్రవహిస్తున్నాయి. వరి పంట పొట్ట దశకు చేరి కంకులు వేయడంతో ఇకపై వర్షాలు కురవకపోయిన ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో ఖరీఫ్ వరి పంట పండటానికి ఢోకా లేదని మండల వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వరి పంట ఆశాజనకం



ఖరీఫ్ ప్రారంభంలో వరి పంట సాగుకు నీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడ్డాం. డీజిల్ ఇంజిన్లతో నీరు తోడి వరి నాట్లు వేశాం. నాట్లు వేసిన తరవాత వర్షాలు కురవడంతో ఇపుడు వరి పొలాలకు నీరు అందుతోంది. వరి పంట పొట్ట దశకు చేరింది. చెరువులు, బావులు నీటితో నిండడంతో సాగునీటి బాధలు తప్పాయి. పంట దిగుబడులు సాధిస్తాం.

– జర్రిపోతుల రామారావు, దిబ్బిడి రైతు

అనుకూలంగా వర్షాలు



వర్షాకాలం ఆరంభంలో వర్షాలు తక్కువగా కురిసిన మండలంలో మాత్రం సాధారణ వర్షపాతం కన్నా అధికంగానే వర్షాలు కురిశాయి. ఖరీఫ్ వరి పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. అన్ని గ్రామాల్లో రైతులు వేసిన వరి పంట పొట్ట దశ నుంచి వరి కంకులు వేస్తున్నాయి. తెగుళ్ల బెడద తక్కువగా ఉంది. మెరక ప్రాంత రైతులకు వర్షాలు మేలు చేశాయి. నీటి కొరత లేకపోవడంతో ఎకరాకి 35 నుండి 50 బస్తాలు వరకు దిగుబడిని రైతులు సాధిస్తారని అంచనా వేస్తున్నాం.

– భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట

దేవాలయ కమిటీల్లో బ్రాహ్మణులకు స్థానం హర్షణీయం

చోడవరం రూరల్ : రాష్ట్రంలోని అన్ని దేవాలయాల కమిటీలలో ఇద్దరు బ్రాహ్మణులకు స్థానం కల్పించడానికి రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించడం హర్షదాయకమని స్థానిక గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఉపాధ్యక్షుడు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా బ్రాహ్మణ వర్గానికి మేలు చేస్తుందన్నారు. దేవాలయ కమిటీల్లో హిందూ సంప్రదాయాలు, ఆగమ శాస్త్రాల పట్ల అవగాహన ఉన్న బ్రాహ్మణ వర్గానికి స్థానం కల్పించడం, ఆయా దేవాలయాల అభివృద్ధికి వీలు కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. తమ వర్గానికి గుర్తింపును ఇస్తున్న కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కండి

నర్సీపట్నం : ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయు, మిత్ర సంఘాల అభ్యర్థి డాక్టర్ గాది శ్రీనివాసులనాయుడు సూచించారు. నర్సీపట్నంలో గురువారం ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఓటరుగా నమోదు చేసుకునే వారు ఆధార్, ఓటర్ ఐడీ వివరాలు అప్లికేషన్‌కు జతపరచాలన్నారు. కనీసం మూడేళ్ల హైస్కూల్లో పనిచేసిన వారిని అర్హులుగా గుర్తిస్తారన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

పెద్దేరు, తాచేరు వంతెన పనులు పూర్తి చేయాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్మూర్తి తదితరులు

బుచ్చెయ్యపేట : మండలంలో దెబ్బతిన్న పెద్దేరు, తాచేరు వంతెన పనులు చేపట్టకపోతే ప్రజలు రోడ్డెక్కి నిలదీసే పరిస్థితులు వస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామ్మూర్తి తెలిపారు. గురువారం శ్రీరాంపట్నం తన ఇంటి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం, చోడవరం, పాడేరు, విశాఖ, అనకాపల్లి రహదారులు వర్షాలకు బాగా దెబ్బతిని ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్డీయేలో ఉన్న మేం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు మిత్ర పక్షమైన ప్రజా సమస్యల పట్ల స్పందించకపోతే ప్రజలకు మేం సమాధానాలు చెప్పలేమన్నారు. కొత్తగా రోడ్లు, జలశయాలు కట్టకపోయినా దెబ్బతిన్న వాటికి మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. వడ్డాదిలో కూలిన పెద్దేరు, విజయరామరాజుపేటలో తాచేరు వంతెనలు కూలిపోగా వీటి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి ఆరు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పెద్దేరు, తాచేరు, కోనాం, మేహాద్రిగెడ్డ, రైవాడ, కల్యాణలోవ, తాండవ జాలాశయాలకు మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్ల వద్ద పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలన్నారు. ఈ నెల 26వ తేదీన పి.భీమవరం గ్రామానికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు వస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి రాజేష్, మండల బీజేపీ అధ్యక్షుడు సీతా నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన కార్యక్రమం


ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: ఈ నెల 25 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు అఖిల భారత పశు గణన కార్యక్రమం జరగనుందని, ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాడుగులలో విలేకరులతో మాట్లాడారు. పశుగణన కోసం మాడుగుల మండలం నుంచి 11 మందిని, చీడికాడ మండలం నుండి 9 మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. రెండు మండలాలకు సూపర్‌వైజర్‌లుగా వైద్యాధికారులు మణిలక్ష్మణ్, అరుణకిరణ్, గాయత్రీ, కాఘవమ్మ నియమించడం జరిగిందన్నారు. పశుగణన, అనేది, పశుసంవర్ధక శాఖలోని వివిధ రకాల, రూపకల్పన, టీకాలు తయారీ, మందులు పంపిణీకి ఉపయోగపడుతుందన్నారు. పశుగణనకోసం ఇంటింటికి వచ్చే విషయ సేకరణదారులకు మీ వద్ద ఉన్న పశువులు, మేకలు, గొర్రెలు, ఇతర జీవాలు వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో కృష్ణదేవిపేట, గొలుగొండ పశువైద్యశాల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం నుంచి పశు గణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు శిరీషా, రమేష్ తెలిపారు.

నర్సీపట్నం : పశుగణనకు పాడి రైతులు సహకరించాలని నర్సీపట్నం ఏరియా వెటర్నరీ ఆస్పత్రి ఏడీ రాంబాబు సూచించారు. శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా పశుగణన ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. గణనకు నర్సీపట్నం 8, గొలుగొండ 9 మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. వైద్యులు రమేష్, శిరీష, పర్యవేక్షణలో గణన జరుగుతుందన్నారు.

కలిగొట్ల వంతెన అప్రోచ్ రోడ్డుకు స్థల పరిశీలన

రైతులతో మాట్లాడిన అనకాపల్లి ఆర్డీవో ఆయిషా


కలిగొట్ల వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఆయిషా

దేవరాపల్లి : కలిగొట్ల వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు చర్యలు చేపడుతున్నామని అనకాపల్లి ఆర్డీవో ఎస్.ఆయిషా అన్నారు. కలిగొట్లలో వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సిన ప్రాంతాన్ని గురువారం ఆమె స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కలిగొట్లలో వంతెన పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు లేని కారణంగా వంతెన నిరుపయోగంగా మారిందన్నారు. దీంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సమీపంలోని పది మందికి చెందిన 2.20 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు. వీరందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సదరు రైతులకు వివరించామన్నారు. అనకాపల్లి డివిజనల్ పరిధిలో రీసర్వే రెవెన్యూ గ్రామ సభలకు విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు 400కు పైగా అర్జీలు వచ్చాయని, వీటన్నింటికి వీలైనంత త్వరగా పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. సాగు నీటి సంఘాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ఈయన వెంట మండల సర్వేయర్ జి. గోవిందరాజులు, ఆర్‌ఐ ఎస్.సతీష్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ పి.శ్రీనివాసరావు, వీఆర్‌వోలు కనకారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మేడిచర్లలో రెవెన్యూ గ్రామసభ

కె.కోటపాడు : మండలంలో మేడిచర్ల గ్రామంలో శుక్రవారం రీసర్వే- గ్రామసభను నిర్వహించనున్నట్లు తహసీలాందర్ భాగ్యావతి పేర్కొన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు గల వారు అర్జీలను సమావేశంలో అధికారులకు అందించాలని సూచించారు. రీసర్వే గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాకవరపాలెం : భూ సమస్యలపై రైతుల నుంచి 21 దరఖాస్తులు అందాయని రీ సర్వే డీటీ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని జంగాలపల్లిలో గురువారం రీ సర్వేలో దొర్లిన తప్పులను సరి చేసేందుకు రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రెవెన్యూ పరిధిలో ఉన్న 21 మంది రైతులు వివిధ భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. వీటిపై విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని డీటీ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సూర్యనారాయణ పాల్గొన్నారు.

చీడికాడ : తంగుడుబిల్లి గ్రామంలో గురువారం రీసర్వే రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. స్థానిక తహసీల్దారు వై.వి.ఎస్. ప్రసాద్ ఆధ్వర్యంలో 16 అర్జీలను ప్రజలు నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ


కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో మేరీ రోజ్


గొలుగొండ : పుత్తడిగైరంపేట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయని కొంత మంది గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులపై గురువారం ఎంపీడీవో మేరీ రోజ్, ఏపీవో సూర్యమణి గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో కూలీల నుంచి వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు ఎంత నిధులు ఖర్చు జరిగింది, ఎంత మంది కూలీలు పనులకు వెళ్లారో వివరాలు సేకరించారు. ప్రధానంగా ఇచ్చిన ఫిర్యాదులపై వివరాలు సేకరించారు. పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తి రమణతో పాటు ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు పండి సిరులు కురవాలి


గౌరీ పరమేశ్వరులకు రైతులతో కలసి పూజలు చేస్తున్న సర్పంచ్ కాంతమ్మ

రోలుగుంట: మండలం కొవ్వూరు గ్రామంలో రైతులతో కలసి సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ గురువారం శ్రీ గౌరీపరమేశ్వరులను దర్శించుకొని పంటలు పండి సిరులు కురిపించాలంటూ పూజలు చేసుకున్నారు. దీనిలో భాగంగా గ్రామంలో రైతులు గ్రామ ఆచారం పాటిస్తూ తమ వరి పొలంలో దుబ్బులు కోసి, అమ్మవారి పాదాల చెంత పెట్టి పూజలు చేశారు. పంటలను తెగుళ్ల ఆశించకుండా మంచి దిగుబడులు రావాలని కోరుకున్నారు.

డిగ్రీ కళాశాల స్థలం పరిశీలించిన ఆర్డీవో


మాడుగులలో స్థలం పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ తదితరులు

మాడుగుల : స్థానిక పార్థసారథి కొండ దగ్గరలో గతంలో డిగ్రీ కళాశాలకు కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని ఆర్డీవో వి.వి.రమణ గురువారం పరిశీలించారు. ఈ స్థలంలో తుప్పలు తొలగించి శుభ్రం చేయించాలని రెవెన్యూ అధికారులుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ స్థలం డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని, స్థలానికి సంబంధించి మ్యాప్‌ను పరిశీలించారు. తహసీల్దార్ కె. రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో జగన్‌ను కలిసిన ధర్మశ్రీ


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ విమానాశ్రయంలో కలిసిన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : నియోజకవర్గంలో పార్టీని మరింత మెరుగుపర్చేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చెప్పారు. విశాఖపట్నం వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని విమానాశ్రయంలో గురువారం కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించానని ధర్మశ్రీ చెప్పారు. మండలాల వారీగా పార్టీ ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి పని చేయాలని ఆయన సూచించారని ధర్మశ్రీ తెలిపారు. ధర్మశ్రీతోపాటు ఆయన తనయుడు సూర్య కూడా మాజీ సీఎంను కలిశారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..


గోవాడలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు

చోడవరం : గోవాడలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యను అధికారులు పరిష్కరించారు. గోవాడ గ్రామంలో పలు ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు ఆందోళనకు దిగిన సంఘటన సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై చోడవరం విద్యుత్‌శాఖ రూరల్ ఏరియా అధికారులు స్పందించారు. విద్యుత్‌శాఖ ఏఈ ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తలెత్తిన సమస్యకు గురువారం మరమ్మతులు చేపట్టారు. లైన్లను పునరుద్ధరించడంతో లోఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఈనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలి


తహసీల్దార్ భాగ్యవతికి వినతిపత్రం అందిస్తున్న మోహన్‌రావు, రైతులు

కె.కోటపాడు : మూడు తరాలుగా రైతుల సాగులో ఉన్న ఈనాం భూములకు రెవెన్యూ అధికారులు రైత్వారీ పట్టాలను మంజూరు చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు అన్నారు. కె.కోటపాడు తహసీల్దార్ భాగ్యవతిని గురువారం సాగు రైతులతో కలిసి పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ రైతుల సాగులో భూములపై గతంలో ఏపీ ఈనాం రద్దు చట్టం 1956 ప్రకారం అధికారులు ఇచ్చిన గెజిట్ పబ్లికేషన్, ప్రొసీడింగ్, హైకోర్టు ఉత్తర్వులను పరిశీలించి పట్టాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. రైతులు సాగులో ఉన్న ఈనాం భూములను దేవదాయశాఖ రిజిష్టర్‌లలో ఏ విధంగా నమోదు అయ్యాయో సమగ్ర విచారణ జరపాలని మోహన్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, అప్పలకొండ, నారాయణ, ముసిలినాయుడు, దనిమిశెట్టి పైడినాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

మద్యం షాపులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


ఎక్సైజ్ సీఐ ప్రసాద్

మాడుగుల రూరల్ : నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలు నిర్వహించాలని, మాడుగుల ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ సీఐ సిహెచ్‌విఎస్ ప్రసాద్ అన్నారు. ఆయన గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో మాడుగుల మండలంలో 5, చీడికాడ మండలంలో 3, రావికమతం మండలంలో 5, షాపులు, ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రాలో పాల్గొని షాపులు దక్కించుకున్న యజమానులు ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు జన నివాస ప్రాంతాల్లో ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. రావికమతం మండలం కొత్తకోటలో మద్యం దుకాణం నివాస ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగిందని దానిని వెంటనే వేరొక చోటకు మార్పు చేయాలని రాష్ట విధాన మండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు అక్కడ ఏర్పాటు చేసిన మద్యం దుకాణం జన నివాసానికి ఇబ్బంది కలిగించే విధంగా ఉందా, లేదా అనే దానిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అలాగే చీడికాడలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం కూడా జనావాస ప్రాంతంలో ఉందని, దాని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గౌరీపట్నం రెవెన్యూ సభలో 321 అర్జీలు

చోడవరం: భూముల రీసర్వేలో సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టామని తహసీల్దార్ రామారావు చెప్పారు. మండలంలో గౌరీపట్నం గ్రామంలో భూముల రీ సర్వే గ్రామసభను గురువారం నిర్వహించారు. రెవిన్యూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ సభలో 321 అర్జీలు ఇచ్చారు. ఈ సభలో భూముల రీ సర్వేలో చోటుచేసుకున్న లోపాలను సవరించాలని, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయాలని అర్జీలు అందాయి. అర్జీలను స్వీరించిన తహసీల్దార్ రామారావు వాటిని త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నాతవరం: భూరీసర్వేలో లోపాలను సరి చేసేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహించడం ముఖ్యోద్దేశ్యమని డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్.రాజు అన్నారు. ఆయన మండలంలో కృష్ణాపురం అగ్రహారం గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా దరఖాస్తు చేసుకుంటే సరి చేయడం జరుగుతుందన్నారు. గ్రామసభలో 10 మంది రైతులు దరఖాస్తులు అందించారన్నారు.

సత్యసాయి సన్నిధిలో అనకాపల్లి భక్తులు


పుట్టపర్తి సత్యసాయి సమాధి వద్ద భక్తుల భజనలు

మాడుగుల : అనకాపల్లి జిల్లా సత్యసాయి భక్తులు ఈ నెల 22వ తేదీన మాడుగుల వచ్చి పుటపర్తి సత్యసాయి ఆలయానికి మాడుగుల హల్వాను ప్రసాదం కోసం తీసుకెళ్లడం తెలిసిందే. గురువారం సత్యసాయి సమాధి వద్ద నృత్య ప్రదర్శనతో పాటు భజనలు నిర్వహించారు. అనంతరం మాడుగుల హల్వాను ప్రసాదంగా భక్తులకు అందజేశారు.